

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
3
బుధవారం 24 ఏప్రిల్ 2024

పరీక్షా కాలం

పిల్లలకే కాదు, అభ్యర్థులకు కూడా..



ప్రజాతీర్పుకు మిగిలింది 19 రోజులే. చరమాంకంలోకి వచ్చింది. అభ్యర్థులంతా భారీ జనసమూహాల మధ్య కేరింతలతో ఉత్సాహంగా నామినేషన్ వేశారు. ఉమ్మడి కూటమి అభ్యర్థులు ఎక్కడా తగ్గకుండా తమ బలమేంటో నామినేషన్‌ల రోజున చూపించే ప్రయత్నం చేశారు. అధికార వైసీపీకి దీటుగా తాము ఉన్నట్టు ప్రజాసంకేతం పంపారు. కాంగ్రెస్, వామపక్షాలు ఇంకోవైపు అభ్యర్థులు నామినేషన్‌లు, ప్రచారాన్ని పర్యవేక్షిస్తున్నాయి. కూటమి పక్షాన టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులైతే ఇప్పటికే నువ్వా నేనా అన్నట్లుగా ప్రచారంలో మునిగితేలుతున్నారు.

- ప్రచారంలోనూ, బుజ్జగింపుల్లోనూ అందరిదీ ఒకటే దారి
- వైసీపీకి దీటుగా అన్నిచోట్లా నామినేషన్లు
- కీలక నియోజక వర్గాల్లో పట్టుదిశగా కూటమి
- దెందులూరులో తొలగిన ప్రతిష్ఠంభన
- చింతమనేనికే రూట్ క్లియర్
- తపనా చౌదరికి నరసాపురం లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి, ప్రతినిధి):

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ళ నాని వైసీపీ పక్షాన తిరిగి పోటీ చేస్తుండగా ఆయనపై తొలిసారిగా ఎన్నికల బరిలో నిలిచిన టీడీపీ అభ్యర్థి బడేటి చంటి కాలుదువ్వుతున్నారు. నానిపై పైచేయి సాధించేందుకు వ్యూహ ప్రతివ్యూహాల్లో ఉన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో ఈ ఇద్దరు అభ్యర్థులు నగరంలో దాదాపు బల నిరూపణకు సిద్ధపడ్డారు. వందలాది మంది కార్యకర్తలతో నగరం కిక్కిరిసింది. ఏలూరు అసెంబ్లీ పరిధిలో అభ్యర్థి నిర్ణేతలు ఇక్కడి నగర ఓటర్లే. ఇక్కడ ఉద్యోగ వర్గాలు, అత్యధికంగా ఉండటంతో వైసీపీకి గండంగానే పరిణమించింది. దీన్ని తమ వైపు బలంగా తిప్పుకోవడానికి చంటి ప్రయత్నిస్తున్నారు. నగరంతో సహా గ్రామీణ లోనూ పట్టుబిగించారు. వైసీపీలోని సీనియర్లు అనేక మంది టీడీపీ వైపు జంప్ చేశారు. దీంతో ఆళ్ళ నాని వర్గం అతిగొప్ప పరీక్షను ఎదుర్కొంటోంది. చింతలపూడిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాను కాదని, విజయ్‌రాజుకు వైసీపీ టిక్కెట్ ఇచ్చింది. ఇక్కడ ఎలీజా బలమెంత? ఆయన ఎంత సంఖ్యలో ఓట్లను చీల్చబోతున్నా రనేది అధికార పార్టీకి పరీక్ష. ఎలీజా కాంగ్రెస్‌లో చేరి చింతలపూడి నుంచి పోటీ చేస్తున్నారు. దీంతో వైసీపీకి సంకటంగా మారింది. దీన్ని అదనుగా తీసుకోవడమే కాకుండా మిగతా వర్గాలను తమవైపు మద్దతుగా తరలిరావడంతో టీడీపీ అభ్యర్థి రోషన్‌కుమార్ ఏ రోజుకారోజు ముఖ్యనేతలు, కార్యకర్తలతో సంప్రదించి ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. ఇక్కడ జనసేన బలీయంగా ఉండడం, టీడీపీకి కొంత కలిసొచ్చేదిగా ఉండగా సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజా పోటీ వైసీపీకి సవాల్‌గా మారింది. నూజివీడులో కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి, వైసీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లుగా మారబోతోంది. మధ్యలో టీడీపీ నుంచి బయటపడ్డ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పోటీలో ఉన్నారు. ఇప్పటికే వీరంతా నామినేషన్లు దాఖలు చేసి రంగంలో ఉన్నారు. బీసీ ఓటర్లలో చీలిక టీడీపీకి పరీక్షగానే మారింది. ఇది ఏ స్థాయిలో ఉంటుంది? అది కూడా ఒక్క యాదవ సామాజిక వర్గంలోనేనా లేక మిగతా వర్గాలపై ప్రభావం ఉంటుందా? అనేది టీడీపీ కసరత్తు చేస్తోంది. అధికార వైసీపీలో ఉన్న మైనస్‌లు అంతర్గతంగా ఆ పార్టీపై పొడచూపుతున్నాయి. ఆర్థికంగా వెసులుబాటు ఉన్నప్పటికీ ఓటింగ్ వచ్చే సరికి ఎలాంటి పరీక్ష ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న టెన్షన్ వైసీపీలో లేకపోలేదు. ఉంగుటూరులో జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు పూర్తిగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. తన ప్రధాన ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి వాసుబాబుతో సై అంటే సై అంటున్నారు. తెలుగుదేశం, బీజేపీ సంపూర్ణ మద్దతుతో తాను గట్టెక్కగలనన్న విశ్వాసంతో ఉన్నారు. వైసీపీలో ఉన్న కేడర్ లోపాయికారిగా మద్దతు ఇస్తుందని జనసేన అంచనా వేస్తోంది. పోలవరంలో నువ్వా నేనా అన్నట్లుగా రణం సాగుతోంది. వైసీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి వైసీపీ అభ్యర్థిగా తొలిసారి రంగంలోకి దిగారు. ఆమె భర్త సిట్టింగ్ ఎమ్మెల్యే బాలరాజు నాలుగుసార్లు ఇదే నియోజకవర్గం నుంచి పోటీ పడ్డారు. అయితే ఈ నియోజకవర్గంలో జనసేన పక్షాన చిర్రి బాలరాజు జనంలోకి దూసుకువెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. కైకలూరులో ఉమ్మడి కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఇప్పటికే అన్నివర్గాలతో సహా వైసీపీకి వ్యతిరేకంగా ఉన్న వర్గాలను కూడకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొల్లేరు ఓటర్లే ఈసారి అత్యంత కీలకం. దీంతో అధికార వైసీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు ఈ విషయంలో అగ్నిపరీక్షే ఎదుర్కొంటున్నారు.

చింతమనేనికే దెందులూరు

వారం రోజులుగా దెందులూరులో ఉత్కంఠకు గురిచేసిన మార్పు, చేర్పు గండం తొలగిపోయింది. ఈ స్థానం నుంచి బీజేపీ పోటీ చేయాలని గట్టి ప్రయత్నాలే చేసినా మంగళవారం నాటికి అదంతా తేలిపోయింది. టీడీపీ అధిష్ఠానం చింతమనేని ప్రభాకర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రచారాన్ని నిర్విరామంగా కొనసాగించాల్సిందిగా సూచించింది. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ చింతమనేని పక్షాన నిలిచారు. కేడర్‌లోనూ ఆనందం వెల్లివిరుస్తోంది.

నరసాపురం ఇన్‌చార్జ్‌గా తపనాచౌదరి



ఏలూరు లోక్‌సభ స్థానాన్ని ఆశించిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనాచౌదరి విషయంలో మంగళవారం బీజేపీ క్లారిటీ ఇచ్చింది. ఎంపీ స్థానం నుంచి పోటీ చేయడానికి అవకాశం లేకపోవడంతో దెందులూరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దింపాలని బీజేపీ ఈ మధ్యనే పట్టుబట్టింది. ఆ మేరకు ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేసేందుకు చౌదరి సన్నాహాలు చేసుకున్నారు. ఒక్కసారిగా పరిణామాలు మారాయి. దెందులూరును బీజేపీకి కేటాయించడానికి టీడీపీ నో చెప్పడంతో బీజేపీ నాయకత్వం తపనా చౌదరిని నరసాపురం లోక్‌సభ స్థానం బీజేపీ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు. ఆ స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మకు చేదోడువాదోడుగా ఉండాల్సిందిగా సూచించింది. భవిష్యత్తులో అయనకు అతి పెద్ద బాధ్యతను అప్పగిస్తామని బీజేపీ పెద్దలు వాగ్దానం చేశారు. దీంతో మెత్తబడిన తపనా చౌదరి బుధవారం వేద్దామనుకున్న నామినేషన్‌ను రద్దు చేసుకున్నారు.

నామినేషన్ కౌంటర్ (5వ రోజు)

ఎంపీ/ఎమ్మెల్యే నియోజకర్గాలు	ఐదో రోజు నామినేషన్లు	మొత్తం
ఏలూరు ఎంపీ	03	11
1.ఉంగుటూరు	06	10
2.దెందులూరు	02	07
3.ఏలూరు	05	07
4.పోలవరం	04	09
5.చింతలపూడి	02	08
6.నూజివీడు	01	08
7.కైకలూరు	06	11
మొత్తం	26	65
నరసాపురం ఎంపీ	09	14
1.ఆచంట	01	06
2.పాలకొల్లు	00	06
3.నరసాపురం	00	05
4.భీమవరం	07	10
5.ఉండి	05	12
6.తణుకు	02	10
7.తాడేపల్లిగూడెం	04	07
మొత్తం	19	56

ఎంపీకి మూడు.. ఎమ్మెల్యేలకు 26

- జిల్లాలో ఐదోరోజు 29 నామినేషన్లు దాఖలు

ఏలూరు సిటీ/ఏలూరు కలెక్టరేట్/ఉంగుటూరు/దెందులూరు/ ఏలూరు టూటౌన్/ బుట్టాయగూడెం/చింతలపూడి/ నూజివీడు/ ఏప్రిల్ 23 : జిల్లాలో ఐదో రోజు మంగళవారం మొత్తం 29 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి 3, జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 26 నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి వైసీపీ తరఫున అభ్యర్థులుగా కారుమూరి సునీల్‌కుమార్, వెల్లూరు కీర్తిలు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా నిట్టా అఖిల ధరణీపాల్ నామినేషన్లు దాఖలు చేశారు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి కూటమి జనసేన అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజు, వైసీపీ అభ్యర్థిగా పుప్పాల శ్రీనివాసరావు, పుప్పాల ఆదివల్లి రమణి (వైసీపీ) డమ్మీ అభ్యర్థిగా తమ నామినేషన్లు ఆర్వో ఖాజావలికి అందజేశారు. ఇండియన్ లేబర్ పార్టీ అభ్యర్థిగా కనికెళ్ళ మురళీ కృష్ణ, బహుజన్ సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా బుంగా ఏసు, స్వతంత్ర అభ్యర్థిగా నాగం రాంబాబు నామినేషన్లు దాఖలు చేశారు. దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీప తరఫున అభ్యర్థిగా చింతమనేని ప్రభాకర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ఆముదాలపల్లి ప్రసాద్ నామినేషన్ వేశారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఇండియా కూటమి పక్షాలైన సీపీఎం, కాంగ్రెస్, భారత్ బచావో, ఆమ్‌ఆద్మీ పార్టీలు బలపరిచిన సీపీఐ నాయకుడు బండి వెంకటేశ్వరరావు , ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పిట్టా ధనుంజయకుమార్, జిల్లెళ్లమూడి నాగ ఉమామహేశ్వరరావు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా ములగాల జోషిల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. పోలవరం నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా మొడియం సూర్యచంద్రరావు కేఆర్‌పురం ఐటీడీఏలో ఆర్వో ఎం.సూర్యతేజకు నామినేషన్ అందించారు. టీడీపీ తరఫున సూర్యచంద్రరావు చివరివరకు సీటును ఆశించగా పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడంతో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగారు. గోండ్వానా దండకారుణ్య పార్టీ అభ్యర్థిగా మడకం వెంకటేశ్వరావు, ఉయికె మంగమ్మ, కాకా కృష్ణ స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి సూర్యతేజకు అందజేశారు. చింతలపూడి ఆర్వో కార్యాలయంలో ఉన్నమట్ల ఎలీజా కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా, మొవ్వల ఎస్తేర్‌రాణి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నూజివీడు వైసీపీ అభ్యర్థిగా మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నామినేషన్ దాఖలు చేశారు. కైకలూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా కమతం నిరీక్షణరావు, జైభీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా జి. సతీష్‌కుమార్, ఇండిపెడెంట్ అభ్యర్థులుగా చింతాడ శ్రీనివాసరావు, మాదాసు సత్యనారాయణ, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా పాముల ఏశుపాదం నామినేషన్లను దాఖలు చేశారు.



ఆర్వో ఖాజావలికి నామినేషన్ దాఖలు చేస్తున్న ఉంగుటూరు జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు



నగరంలో బడేటి ర్యాలీ.. నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న బడేటి చంటి

అట్టహాసంగా బడేటి నామినేషన్

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 23 : ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిగా బడేటి రాధాకృష్ణయ్య (చంటి) తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్వో ముక్కంటికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ముందుగా ఆర్ఆర్.పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు, మన్నా చర్చిలో ప్రార్థనలు, కోటదిబ్బ దర్గాలో నమాజ్ చేశారు. వేలాది మంది కార్యకర్తలు తరలి రాగా ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి భారీ ఊరేగింపుగా వచ్చారు. యాత్రలో అడుగడుగున ప్రజలు నీరాజనాలు పలికారు. బీజేపీ, జనసేన, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు కూడా భారీగా ర్యాలీకి తరలి రావడం విశేషం. ప్రచార రథంపై ఉన్న ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, బడేటి చంటిలకు పూలవర్షం కురిపించారు. డప్పులు, మేళతాళాలు, బాణసంచా కాల్పులతో పండుగ వాతావరణంలో నామినేషన్ కార్యక్రమం ఆసాంతం సాగింది. కార్యక్రమంలో జనసేన నాయకులు రెడ్డి అప్పల నాయుడు, బీజేపీ సీనియర్ నాయకులు అంబికా కృష్ణ, టీడీపీ ఏలూరు నియోజకవర్గ పరిశీలకులు కాశీ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి సతీమణి రేణుకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడు కృష్ణకాంత్ పాఠక్ పర్యటన

ఏలూరు సిటీ/ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 : జిల్లాకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించిన రాజస్థాన్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ (మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్) డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్ మంగళవారం ఏలూరు విచ్చేశారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ స్వాగతం పలికి పూల మొక్కను అందజేశారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశమయ్యారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకున్న చర్యలను వివరించారు. ఈవీఎం ర్యాండమైజేషన్, మైక్రో పరిశీలకులు శిక్షణ , పీవో, ఏపీవోలకు శిక్షణ , పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర విషయాలను కలెక్టర్ ఆయనకు వివరించారు. జిల్లాలో 16.35 లక్షల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 1,744 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ మీడియా కంట్రోల్ రూమ్‌ను ఆయన సందర్శించారు. మీడియాలో ఎన్నికల ఏర్పాట్లు , ఎన్నికల ప్రవర్తనా నియ మావళి అమలుపై వచ్చే ప్రతి కూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరును ఆరా తీశారు. కలెక్టర్ వివరాలను తెలిపారు. అనంతరం సీ-విజిల్ పర్యవేక్షక విభాగాన్ని సాధారణ పరిశీలించారు.తొలుత జిల్లాలో జరుగుతున్న స్వీప్ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. డీఆర్వో పుష్పమణి, తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లాలో పోలీస్‌శాఖ చేపట్టిన చర్యలు పట్ల కృష్ణకాంత్ పాఠక్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనను ఎస్పీ మేరీ ప్రశాంతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పోలీస్‌శాఖ జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో తీసుకున్న చర్యలను వివరించారు.

పోలీస్ అబ్జర్వర్‌గా కర్ణాటక రాష్ట్ర ఐపీఎస్ అధికారి



ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 : ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లాకు ప్రత్యేకంగా పోలీస్ అబ్జర్వర్‌గా కర్ణాటక రాష్ట్రానికి చెంది న పోలీస్ ఐపీఎస్ అధికారి పి.శ్రీధర మంగ ళవారం ఏలూరు వచ్చారు. ఎస్పీ మేరీ ప్రశాంతి, ఏఎస్పీ స్వరూపరాణి మర్యాదపూ ర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పోలీస్‌శాఖ చేపట్టిన పటిష్ఠ చర్యలను వివరించారు.

2,006 సువిధ అభ్యర్థనల పరిష్కారం

ఏలూరు సిటీ, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈఎస్ఎంఎస్ కింద చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ. 13.64 కోట్లు విలువైన నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఇందులో రూ. 203.20 లక్షలు నగదు కాగా, రూ. 10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ. 136.15 లక్షల విలువైన మద్యం స్వాధీన పరచుకున్నారన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ/ ఎన్‌కోర్ ద్వారా అందిన 2,045 అభ్యర్థనల్లో ఇంతవరకు 2,006 అనుమతులు ఇచ్చామని, 39 పరిశీలనలో ఉన్నాయన్నారు. సి-విజిల్ ద్వారా 399 ఫిర్యాదులను, మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలపై వచ్చిన 106 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ఎస్‌జీఎస్పీ పోర్టల్ ద్వారా 604 ఫిర్యాదులు స్వీకరించగా వాటిలో 603 పరిష్కరించగా ఒకటి పరిశీలనలో ఉందన్నారు.

గ్రామ స్వరాజ్యం మాయం!

- వైసీపీ పాలనలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో అంతా అస్తవ్యస్తం
- ఉత్సవ విగ్రహాల్లా సర్పంచ్‌లు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 23 : పంచాయతీలు పటిష్ఠంగా ఉంటేనే గ్రామస్వరాజ్యం సిద్ధిస్తుందని, మహాత్మాగాంధీ చేసిన ప్రకటనతో రాజ్యాంగంలో ఈ వ్యవస్థకు అగ్రతాంబూలం లభించింది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొంచి ప్రభుత్వ సాయంతో వాటిని అమలుచేసి దేశానికి పట్టుకొమ్మలుగా తీర్చిదిద్దాల్సిన సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. సచివాలయ వ్యవస్థతో సర్పంచ్‌ల అధికారాలతో పాటు నిధులను లాగేసుకున్న సర్కారు వలంటీర్లను అందలం ఎక్కించి వ్యవస్థను చంపేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లకు విలువ లేకుండా చేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 900 పంచాయతీలు ఉన్నాయి. జడ్పీటీసీలు 48, ఎంపీటీసీలు 1001 ఉన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు అయ్యాయి. సచివాలయాలు, గ్రామ పంచాయతీల పరిధిలోనే పనిచేస్తాయని ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత వాటిని తమకు అనుకూలంగా మార్చేసుకుంది. ప్రభుత్వ పథకాలపై పెత్తనం వలంటీర్లకు కట్టబెట్టి లబ్ధిదారుల ఎంపికలో వారికే ముఖ్య పాత్ర అప్పగించింది. సచివాలయ సిబ్బందిని కేవలం పర్యవేక్షణకే పరిమితం చేసింది. వీటితో పాటు ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాల జారీ, కొత్త పథకాల దరఖాస్తులతో పాటు అధికారుల సమీక్షల్లోనూ వలంటీర్లదే హవా. సర్పంచ్‌లకు కనీస విలువ లేకుండా చేసింది. పంచాయతీలకు దమ్మిడి ఆదాయం లేక రాష్ట్రప్రభుత్వం ఇవ్వక, కేంద్రం ఇచ్చేనిధులను పలు ఆంక్షలతో నిలువుదోపిడీ చేసిన తీరుకు విసిగివేశారిన సర్పంచ్‌లు రాజకీయాలకతీతంగా ఆందోళన బాట పట్టారు. 90 శాతం సర్పంచ్‌లు పాలకపక్షం వారే అయినా బిల్లులనూ ఆపి వేధింపులకు గురిచేసింది. సర్పంచ్‌లకు సమాంతరంగా వైసీపీ కార్యకర్తలను గ్రామసారథులుగా, సచివాలయ కన్వీనర్లుగా నియమించి అనధికార, రాజ్యాంగేతర పాలన వ్యవస్థలను జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం విమర్శలకు దారి తీసింది. ' పంచాయతీల్లో ఐదేళ్ల కాలంలో ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోయాం. సచివాల యాలు, వలంటీర్లు వచ్చిన తర్వాత సర్పంచ్‌లు ఎందుకు పనికిరాకుండా పోయారు. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బకాయిల పేరిట లాగేసుకున్న ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదు. ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లను నిర్వీర్యం చేసి ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టలేక పోయాం.' అంటూ ఉమ్మడి పశ్చిమ గోదావరి పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు కడలి గోపాలరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు.

63,166 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

ఏలూరు సిటీ, ఏప్రిల్ 23 : జిల్లాలో నేటి వరకు 5,328 మంది రైతుల వద్ద నుంచి రూ.136 కోట్ల విలువైన 63,166 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు జేసీ లావణ్యవేణి మంగళవారం తెలిపారు. అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 11,356 మంది రైతులకు చెందిన 96,635 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకున్నారన్నారు.

నేటి నుంచి వేసవి పఠనం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 : విద్యార్థుల్లో పుస్తకాలు చదివే అలవాటుని పెంపొందించే లక్ష్యంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 24నుంచి జూన్ 10వతేదీవరకు వేసవి పఠన కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. తేదీల వారీగా ఏప కార్యక్రమాలను నిర్వహించాలనేదానిపై స్పష్టతనిచ్చారు.

నన్ను ఎదుర్కొనే దమ్ము లేక.. ఫేక్ రాజకీయం!

- డాక్టర్ కామినేని శ్రీనివాస్ ధ్వజం
- కోలాహలంగా నామినేషన్ దాఖలు

కైకలూరు, ఏప్రిల్ 23 : 'రాష్ట్రంలో, కైకలూరులోను రాక్షస పాలన సాగుతోంది. దీనికి స్వస్తి పలకాల్సిన అవసరం అందరిపై ఉంది. రాజకీయంగా నన్ను ఎదుర్కొనే దమ్ములేక ఫేక్ వీడియోలు తయారుచేసి ఇతర కులస్తులను నేను దూషిస్తున్నట్టుగా సృష్టించే స్థాయికి స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు దిగజారిపోయారు. దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలే గాని ఫేక్ వీడియో సృష్టించి మతాల మధ్య చిచ్చు పెడితే చూస్తూ ఊరుకోను' అంటూ డాక్టర్ కామినేని శ్రీనివాస్ హెచ్చరించారు. కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ కూటమి అభ్యర్థిగా ఆయన మంగళ వారం 11.15 గంటలకు ఆర్వో భాస్కర్‌కు నామినేషన్ పత్రా లను అందజేశారు. ఆయన వెంట కేంద్రమత్స్యశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు ఉన్నారు. వరహాపట్నం నుంచి సుమారు 25 వేల మంది అభిమానులు, కార్యకర్తల నడుమ ప్రచారరథంపై ఊరేగుతూ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కామినేని నామినేషన్ వేశారు. అనంతరం మీడియాతో కామినేని మాట్లాడుతూ.. 'స్థానికంగా ఉండడంటూ ప్రచారం చేస్తున్నారు. స్థానికంగా ఉండి ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుంటానని హామీ ఇస్తున్నా. కరోనా కష్టకాలంలో వందలాదిమంది కరోనా బారిన పడిన వారికి ఆంధ్రా, తెలంగాణలో అనేక ఆస్పత్రుల్లో చేర్పి సేవలందించా. నిరాధరమైన ఆరోపణలు చేస్తూ నాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన క్యాట్‌ఫిష్ జాతి చేపలను అక్రమ రవాణా చేసి దూలం నాగేశ్వరరావు కోట్లు గడించారు. ఆది నుంచి అక్రమ సంపాదనతోనే ఈ స్థాయికి ఎదిగారు. దమ్ముంటే అక్రమ చేపల వ్యాపారం చేయలేదని ఆలయాల్లో ప్రమాణాలు చేయండి. ఎక్కడికక్కడ రౌడీలను ప్రోత్సహించి ప్రశాంతమైన కైకలూరు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. నేను ఎన్నికల్లో గెలిచిన మరుక్షణమే గతంలోలా ప్రజలు స్వేచ్ఛగా జీవించేలా రౌడీలను, అందుకు సహకరించిన అధికారులను శిక్షించేలా చర్యలు తీసుకుంటాను' అంటూ ఆయన స్పష్టం చేశారు.



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వస్తున్న కామినేని.. ఆర్వోకు నామినేషన్ పత్రాల అందజేత



నిబంధనలు బేఖాతర్..

ఏలూరు ఎంపీ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేసిన సమయంలో ఆ పార్టీ నాయకులు నిబంధనలు ఉల్లంఘించారు. నామినేషన్ దాఖలు సమయంలో ఆర్వో కార్యాలయమైన కలెక్టరేట్‌కు 100 మీటర్ల మేర ఎవరూ లోనికి రాకుండా ఆంక్షలు ఉన్నాయి. అయితే వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకుని భారీ ఎత్తున వాహనాలను కలెక్టరేట్ చుట్టూ నిలుపుదల చేశారు. నామినేషన్ దాఖలు సమయంలో ఐదుగురికి మించి అభ్యర్థి వెంట లోపలకు వెళ్లకూడదు. అయితే సునీల్‌కుమార్ వెంట మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆళ్ళ నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు, కొఠారు అబ్బయ్య చౌదరి, విజయ్ రాజుతో పాటు పలువురు నాయకులను కలెక్టరేట్‌లోకి అనుమతించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ నామినేషన్ సందర్భంగా విపరీతమైన ఆంక్షలు పెట్టిన పోలీసులు చివరకు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను సైతం కలెక్టరేట్‌లోకి రాకుండా అడ్డుకున్నారు. అదే పోలీసులు మరుసటి రోజు అధికార పార్టీ నాయకులను మాత్రం లోపలికి అనుమతించడంతో పోలీసులు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి.

- ఏలూరు కలెక్టరేట్

జన కేతనం
ఆంధ్రజ్యోతి

జగన్మాయ

స్మార్ట్ దగా



టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏలూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వ నిధులు కూడా మంజూరు చేసింది. షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీకి పనులు అప్పగించింది. తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో స్మార్ట్ సిటీ అధ్వాన నగరమైంది. నగర ప్రజలను వైసీపీ ప్రభుత్వం దగా చేసింది. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణానికి 2014లో టీడీపీ ప్రభుత్వం యూజీడీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అమృత్ నిధులు విడుదలయ్యాయి. పనులు కూడా చేపట్టారు. తర్వాత ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలకులు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని అటకెక్కించారు.

\- ఏలూరు సిటీ / టూ టౌన్

- ఏలూరు స్మార్ట్ సిటీ ఊసెత్తలేదు
- నగరంలో భూగర్భ డ్రెయినేజీ ఏదీ...?
- అసంపూర్తిగా తమ్మిలేరు రక్షణ గోడ నిర్మాణం
- చిన్నపాటి వర్షానికే నీట మునుగుతున్న రహదారులు
- నగరంలో రహదారులు అధ్వానం
- వేసవిలో నగరంలో తాగునీటి ఎద్దడి
- ఐదేళ్లుగా పరిష్కారం కాని, అమలుకు నోచని హామీలు

నెరవేరని సీఎం హామీలు



స్మార్ట్ సిటీ



ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్

టీడీపీ ప్రభుత్వం ఏలూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని ప్రకటించడంతో నగర ప్రజలు సంబరపడ్డారు. జీవన ప్రమాణాలు మెరుగవుతాయని, పారిశ్రామికాభివృద్ధితో తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని నగర ప్రజలు ఆశపడ్డారు. దీనికి అనుగుణంగానే స్మార్ట్ సిటీ పనులను షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీకి ఆ ప్రభుత్వం అప్పజెప్పింది. ఈ సంస్థ నగరంలో పర్యటించి రూ.1242.82 కోట్లు ఖర్చవుతాయని ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించింది. ఆమోదించిన టీడీపీ ప్రభుత్వం స్విస్ ఛాలెంజ్ పద్ధతిపై రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంస్థను ఆదేశించింది. రూ.5.86 కోట్లను ప్రభుత్వ వాటాగా మంజూరు చేసింది. దీనిలో సుమారు రూ.2 కోట్లతో నగరంలో కొన్ని అభివృద్ధి పనులు జరిగాయి. 2019 ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు అటకెక్కాయి. ప్రభుత్వం మంజూరు చేసిన సొమ్ములో మిగిలిన రూ.3.86 కోట్లు ఆచూకీ లేదు.

స్మార్ట్ కమిటీ

స్మార్ట్ సిటీ నిర్వహణకు కలెక్టర్ ఛైర్మన్‌గా, డైరెక్టర్లుగా ఎస్పీ, నగర పాలక సంస్థ కమిషనర్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ముగ్గురితో కమిటీ నియమించారు.

ప్రత్యేకతలు

అంతర్జాతీయ స్థాయి జీవన ప్రమాణాలు, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, పారదర్శక పరిపాలన, పర్యావరణ పరిరక్షణ, నిరంతరం 24 గంటలు నీటి సరఫరా, మెరుగైన మురుగునీటి పారుదల సౌకర్యం, వరదల నివారణ, రక్షణ, భద్రత, అభివృద్ధి.

ఏలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కాలేదు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం, ప్రస్తుతం ఏలూరు జిల్లా కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఏలూరు నియోజకవర్గంలో విలీన గ్రామాల్లో తాగునీటి సమస్య వెంటాడుతోంది. శివారు కాలనీలకు అంతర్గత రహదారులు లేకపోవటంతో నానా అవస్థలు పడాల్సి వస్తోంది. నగరంలోని ప్రధాన ప్రాంతాలు మినహా అన్ని చోట్ల రహదారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా నగరంలో అంతంత మాత్రమే.

ఇవీ సీఎం ఇచ్చిన హామీలు

ఏలూరు నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ప్రాంతంలో ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత పర్యటించినప్పుడు ఎన్నో హామీలు ఇచ్చారు.

- ఏలూరు నగరాన్ని ముంచెత్తే తమ్మిలేరుకు రక్షణ గోడ నిర్మిస్తామని సీఎం జగన్మోహనరెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు పనులు పూర్తికాలేదు. వర్షం వస్తే నగరం జలమయం కావడం సార్వసాధారణం
- జాలిపూడి డ్రెయిన్ ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. నామమాత్రంగా పూడిక తొలగింపు పనులకే పరిమితం. డ్రెయిన్ ఆక్రమణలు తొలగించలేదు. అభివృద్ధి చేయలేదు.
- వన్ టౌన్‌లో భూగర్భ డ్రైనేజి సమస్య ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉంది. భూగర్భ డ్రైనేజి ఏర్పాటుకు నగరపాలక సంస్థ రూ.112కోట్లతో డీపీఆర్ రూపొందించినా కార్యరూపం దాల్చలేదు.

ఎమ్మెల్యే హామీలు

- తమ్మిలేరు గట్టుపై నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే ఆళ్ల నాని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదు.
- నగరంలో రహదారులు పూర్తిస్థాయిలో నిర్మించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాయని హామీ ఇచ్చారు. నేటికీ రహదారులను పట్టించుకోలేదు.
- పోణంగి డంపింగ్ యార్డ్‌ను వేరొక ప్రాంతానికి తరలిస్తామని, చెత్త రీసైక్లింగ్ యూనిట్ నెలకొల్పుతామని హామీలు నెరవేరలేదు.
- శనివారపుపేట కాజ్‌వేపై వంతెన ఏర్పాటు నేటికీ ప్రారంభం కాలేదు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదు.
- వాటర్ గ్రిడ్ పథకం అమలు కాని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికీ ఏలూరు నగరంలో వేసవి కాలంలో స్వచ్ఛమైన తాగునీరు అంతంత మాత్రంగానే అందుతుందని చెబుతున్నారు.

భూగర్భ డ్రెయినేజీ



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైపులు ఇలాపైనే పగిలిపోతున్నాయి

యూజీడీ నిర్మాణానికి నిధులిలా..

కేంద్ర ప్రభుత్వం	రూ.10.05 కోట్లు
రాష్ట్ర ప్రభుత్వం	రూ. 3.90 కోట్లు
కార్పొరేషన్	రూ.14.18 కోట్లు
పొల్యూషన్ బోర్డు	రూ. 9.31 కోట్లు
మొత్తం	రూ.38.48 కోట్లు

దశాబ్దాల తరబడి నగర వాసులను పట్టిపీడిస్తున్న సమస్య మురుగు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణంతో సమస్య పరిష్కరిస్తామని పాలకుల హామీ అమలుకోసం ఎదురు చూసిన నగర వాసులు నిరాశ చెందారు. 2014లో టీడీపీ ప్రభుత్వం యూజీడీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రాబోయే 30 ఏళ్ల ప్రజల అసరాలు తీర్చే విధంగా డిజైన్ చేశారు. ఆపై మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని మరో 10 ఏళ్లకు పెంచుకోవడానికి రూపొందించారు. కేంద్రం అమృత్ పథకంలో రూ.37.48 కోట్ల మంజూరయ్యాయి. 29, 38, 39, 40, 50, 1వ డివిజన్లలో పూర్తిస్థాయి ముగురునీటి పారుదల ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. చింతలపూడి సబ్ బేసిన్ ప్రాంతంలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ నిర్మాణం, 50 లక్షల లీటర్ల కెపాసిటీతో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు 2017లో శ్రీకారం చుట్టారు. 21 కిలోమీటర్ల మేర భూమిలో పైపులు వేసి మురుగునీటి శుద్ధి కేంద్రం ప్లాంట్‌కు అనుసంధానం చేసే ప్రక్రియ మొదలైంది. పనులన్నీ మధ్యలో ఉండగానే 2019 ఎన్నికలు వచ్చాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు అటకెక్కించింది. నిధులున్నా పనులు ఆగిపోవడంతో నగర ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఏడేళ్ల క్రితమే కొన్న పైపులు కొన్ని పగిలిపోతున్నాయి, మరికొన్ని పాడైపోతున్నాయి.



దెందులూరులో చింతమనేని కుమార్తె



పాలకొల్లులో నిమ్మల సూర్యకుమారి



ఉండిలో రఘురామకృష్ణరాజు భార్య రమాదేవి



వేల్పూరులో అరిమిల్లి తనయుడు నిఖిల్‌రత్న



ఇంకెన్ని రోజులు..!

ఖర్చు తడిసిమోపెడు
అభ్యర్థుల గగ్గోలు

ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ఖర్చులకు హడలెత్తిపోతున్నారు. మండుతున్న ఎండలు, మరో వైపు విస్తృత ప్రచారం. అదే సమయంలో కార్యకర్తలు, పార్టీ అభిమానులను చూసుకోవడం అభ్యర్థులకు సవాలుగా మారింది. ప్రధాన పార్టీల అభ్యర్థుల కార్యాలయాల వద్దఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి డిన్నరు ఏర్పాటు చేస్తున్నారు. టీ, కాఫీలు, చల్లటి నీరు. శీతల పానీయాలు అందుబాటులో ఉంచుతున్నారు. ఏ సమయంలోనైనా అభిమానులు కార్యకర్తలకు ఆహార ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారు. పట్టణంలోని వార్డుల్లోనూ నియోజక వర్గ పరిధిలోని గ్రామాల్లోనూ ఎన్నికల ప్రచారం జరిగే ప్రాంతాలలో పార్టీ నాయకులే ఆహార పానీయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికలు ఇంకెన్నీ రోజులురా?... బాబూ అంటూలెక్క పెట్టుకుంటున్నారు. అభ్యర్థులకు కేవలం ఆహార పానీయాలకే రోజుకు లక్షల్లో ఖర్చవుతుందని అంచనా.

\- పాలకొల్లు



సపరివార సకుటుంబ సమేతం

అభ్యర్థుల కుటుంబ ప్రచారం

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలతో కలసి ప్రచారం చేయడం సాధారణం. ఈ ఎన్నికల్లో బంధుమిత్ర సపరివార సకుటుంబ సమేతంగా అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థుల కుటుంబ సభ్యులు నియోజకవర్గం నలుమూలలా ప్రచార బాధ్యతలు చేపట్టారు. భార్య, కుమారులు, కోడళ్లు, సోదరులు, తల్లి, తండ్రి బంధుగణమంతా కలసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

కొన్ని దశాబ్దాలు వెనక్కి చూస్తే పోటీలో ఉన్న అభ్యర్థి తప్ప కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేవారు కాదు. కుటుంబ సభ్యులతో కలసి ప్రచారానికి శ్రీకారం చుట్టింది కనుమూరి బాపిరాజు. 1978లో కైకలూరులో ఆయన భార్య అన్నపూర్ణమ్మ ప్రచారం చేశారు. ఆయన అత్తిలిలో పోటీచేసినప్పుడు కుటుంబ సభ్యులు భాగస్వాములు అయ్యారు. తరువాత చాలామంది అభ్యర్థులు వారి కుటుంబ సభ్యలను ప్రచారంలో దించారు. ఉండి నియోజకవర్గంలో కలిదిండి అబ్బాయిరాజు కుటుంబ సభ్యులతో ప్రచారం చేయించారు. భీమవరంలో నాచు వెంకట్రామయ్య బంధుగణం ఎన్నికల ప్రచారం చేశారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కూడా ఆయన కుటుంబసభ్యులతో ప్రచారం చేయించారు.

ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులతో పాటు వారి కుటుంబాలు ప్రచారంతో నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. పాలకొల్లులో నిమ్మల రామానాయుడు భార్య సూర్యకుమారి, దెందులూరులో చింతమనేని ప్రభాకర్ భార్య రాధారాణి, కుమార్తె నవ్యశ్రీ, తణుకు నియోజకవర్గంలో ఆరిమిల్లి రాధాకృష్ణ భార్య కృష్ణ తులసి, కుమారుడు నిఖిల్ రత్న నియోజకవర్గంలో వేర్వేరు మండలాల్లో ప్రతిరోజు ప్రచారం చేస్తున్నారు. ఉంగుటూరులో పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు, ఉండిలో రఘురామకృష్ణరాజు భార్య రమాదేవి, నరసాపురంలో బొమ్మిడి నాయకర్ భార్య, చింతలపూడిలో సొంగా రోషన్‌కుమార్ తండ్రి, ఆచంటలో పితాని సత్యనారాయణ కుమారుడు వెంకట్ ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. అభ్యర్థుల బంధువులంతా ఎండను సైతం లెక్కచేయకుండా కలియ తిరుగుతున్నారు.

\- భీమవరం టౌన్

చింతలపూడిలో రోషన్‌కుమార్ తండ్రి ప్రచారం





నరసాపురంలో నాయకర్ భార్య

తణుకులో ఆరిమిల్లి కృష్ణతులసి





పెదవేగిలో చింతమనేని రాధారాణి

ఆనాటి ముచ్చట

ఎన్నికల ఖర్చు ఊహించలేం



ముళ్ళపూడి వెంకట కృష్ణారావు
మాజీ ఎమ్మెల్యే, తణుకు

నాటి ఎన్నికలకు నేటి ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంది. తణుకు నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించాను. 1985లో మొదటి సారి ఎమ్మెల్యేగా పోటీ చేసినపుడు మా కుటుంబ సభ్యులు లక్షా యాభై వేలు ఖర్చు చేశారు. 1989లో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ముళ్ళపూడి కుటుంబం అంతా చూసుకుంది. నాకు తెలిసి ఎన్నికల ఖర్చులు నాడు చాలా తక్కువ పరిమితిలో ఉండేవి. ఇపుడు ఖర్చులకు ఊహించుకునే విధంగా కనిపించడం లేదు. ఎప్పటికప్పుడు ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. ఒకపుడు రాజకీయాలు సేవకు మారు పేరుగా ఉండేవి. ఇపుడు రాజకీయాలు ఎందుకు చేస్తున్నారో అందరికి తెలుసు. రాజకీయాల్లో విలువలు లేకుండా పోయాయి, ఇది చాలా అనర్థాలకు దారితీస్తుంది.

\- తణుకు

ఓటు ..ఎంతెంత దూరం!



మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే

ప్రతీ సాధారణ ఎన్నికల్లో మండుటెండలో మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి దళితవాడ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి వస్తున్నది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు స్థానికంగానే పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తున్న అధికారులు లోక్ సభ, శాసనసభ ఎన్నికలకు మాత్రం మూడు కిలోమీటర్లు నడిపిస్తున్నారు. కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మారుమూలన ఉన్న ముదినేపల్లి మండలం పేరూరు శివారు తేరగూడెం దళితవాడ ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. తమ దళితవాడ నుంచి పేరూరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓట్లు వేయాలి. దళితవాడలో 120 మంది ఓటర్లు ఉన్నారు. అధ్వాన్నపు రోడ్డుపైన నడుచుకుంటూ వెళ్లి ఓటు వేయటం ఇబ్బందికరంగానే ఉంది.

\- ముదినేపల్లి

జీపులు.. ఆటోలకు గిరాకీ

ఎన్నికల ముందువరకు జీపులు, యజమానులు, ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక డీలా పడ్డారు. ఎన్నికల వేడి ఎప్పుడు మొదలైందో అప్పటి నుంచి జీపు యజమానులకు, డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు మంచి ఛాన్స్. రాజకీయ నాయకుల ప్రచారానికి జీపులు, ఆటోలు కావాలి. జీపు, ఆటోడ్రైవర్‌తో మాట్లాడి ఉదయం కాగానే గ్రామానికి ప్రచారానికి వెళుతున్నారు. జీపు రోజుకు రూ.3వేలు, డ్రైవర్ బేటా, డీజిల్ అదనం, ఆటోకు రూ.1500, డ్రైవర్ బేటా, డీజిల్ ఆయా రాజకీయపార్టీల నాయకులే భరించాలి. కార్యకర్తలతో పాటు డ్రైవర్లకు టిఫిన్ సౌకర్యం ఉంటుంది. గ్రామంలో ఉదయం 6 గంటలకు ప్రచారం ప్రారంభించి, 10 గంటలకు ముగించుకుని తాము తీసుకువెళ్ళిన వాహనాల్లో తిరిగి గ్రామానికి చేర్చుతున్నారు. సాయంత్రం మరోసారి 5 గంటల నుంచి 7 గంటల వరకు ప్రచారం నిర్వహిస్తున్నారు. సాయంత్రం కార్యకర్తలకు ఇచ్చే మందుబాటిల్ కోటాలోనే డ్రైవర్లకు క్వాటర్ బాటిల్ వస్తుంది. పెద్దగా కష్టపడకుండా జీపు, ఆటోడ్రైవర్లకు భలే గిరాకీ.

\- ఏలూరు కల్చరల్

బాబ్బాబు.. రండి

జన సమీకరణకు వైసీపీ అభ్యర్థి తంటాలు
నామినేషన్‌కు పక్క నియోజకవర్గాల జనం



పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి గుడాల గోపీ జనసేకరణకు తంటాలు పడుతున్నారు. బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా భారీ సంఖ్యలో జనంతో బలనిరూపణ ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ కేడర్‌తో పాటు జనాన్ని రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున జన సమీకరణకు ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తుంది. అవసరమైతే పక్క నియోజకవర్గాల నుంచి సైతం జన సమీకరణ చేయడానికి సమాయత్తం అవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈనెల 19న టీడీపీ అభ్యర్థి నిమ్మల రామానాయుడు నామినేషన్ వేశారు. ఈకార్యక్రమానికి 20వేలకు పైబడి పార్టీ అభిమానులు హాజరయ్యారు. అందుకు దీటుగా జనసమీకరణ చేయడానికి వైసీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందు కోసం ఇప్పటికే గ్రామాలు, పట్టణంలో వార్డులు వారీగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాగా జన సమీకరణకు పెద్ద ఎత్తున సొమ్ములు పంపిణీ చేస్తారని ప్రచారం జరుగుతుండటంతో జెండా పట్టే ఉత్సాహవంతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. టీడీపీ అభ్యర్థి నామినేషన్‌కు ఉదయం అల్పాహారంతో పాటు శీతల పానీయాలు, మధ్యాహ్నం మాంసాహార భోజనాలు ఏర్పాటు చేశారు. వైసీపీ అభ్యర్థి భారీ ఎత్తున సొమ్ములు పంపిణీ చేస్తారని ప్రచారం ముమ్మరంగా జరుగుతుండటంతో నామినేషన్ ప్రక్రియ నాడే సొమ్ములు పంపిణీ చేస్తారని పలువురు ఆశగా ఎదురుచూస్తున్నారు.

\- పాలకొల్లు

జగన్ మామా డబ్బులేవీ..

వసతిగృహాల విద్యార్థులకు చెల్లించని కాస్మెటిక్ చార్జీలు
రెండు రోజుల్లో సెలవులు



బడుగు, బలహీనవర్గాల పిల్లలు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు కాస్త సంక్షామ గృహాలుగా మారిపోయాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహాల్లోని విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు నిలిచిపోయాయి. తమ పిల్లలకు ఉండకూడదన్న ఉద్దేశంతో పేదలు వారి పిల్లలను కిలోమీటర్ల దూరంతో వసతి గృహాలకు పంపుతుంటారు. ఉచిత వసతి, భోజనంతో పాటు ఇతరత్రా చేతిఖర్చులకు ప్రభుత్వమే డబ్బులు ఇచ్చిందని భావించి చేర్పిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం మాత్రం నెలవారి కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటినుంచి డబ్బులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మరో రెండురోజుల్లో వసతిగృహాలకు సెలవులు కూడా ఇవ్వనున్నారు. ఈలోగా విద్యార్థుల డబ్బులు చెల్లిస్తారో లేదో చూడాలి. వసతిగృహాల్లోని విద్యార్థులకు ప్రతినెల కాస్మోటిక్ ఛార్జీల క్రింద మూడునుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 ఇస్తుంటుంది. అన్ని తరగతులకు చెందిన బాలురకు రూ.30చొప్పు హెయిర్ కటింగ్ ఛార్జీల క్రింద అధనంగా ఇవ్వాలి. విద్యార్థుల బ్యాంకుఖాతాలకే నేరుగా కాస్మోటిక్ ఛార్జీలు జమ చేయాలి. జూన్‌నెలలో వసతిగృహాలు ప్రారంభమైతే రెండునెలలకు ఛార్జీలు చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. తొమ్మిదినెలలుగా కాస్మోటిక్ ఛార్జీల ఊసేలేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి తమ అవసరాల నిమిత్తం డబ్బులు తెచ్చుకుంటున్నారు. ఐదేళ్లుగా కాస్మోటిక్ కిట్‌ల పంపిణీని ప్రభుత్వం నిలిపివేసింది.

\- ఏలూరు రూరల్

ఎటెట్టా..!



ఆ..మండలానికి ఇద్దరు ఎమ్మెల్యేలు

ఒక మండలం..రెండు నియోజకవర్గాలు



పోడూరు, ఏప్రిల్, 23 : ఆ మండ లానికి ఇద్దరు ఎమ్మెల్యేలు. సగం గ్రామాలకు ఆచంట ఎమ్మెల్యే ప్రాతి నిధ్యం వహిస్తే మిగతా మండ లాలకు పాలకొల్లు ఎమ్మెల్యే పరిధి లోకి వెళతాయి. ఒక మండలంలో రెండు నియోజక వర్గాలకు ప్రాతినిధ్య వహిస్తోంది.. పోడూరు మండలం. ఈ మండలంలో 16 గ్రామాలు ఉండగా 8 గ్రామాలు ఆచంట నియోజకవర్గంలో మరో 8 గ్రామాలు పాలకొల్లు నియోజకవర్గంలో ఉన్నాయి. అందుకే మండలాన్ని ఇద్దరు ఎమ్మె ల్యేలు పాలిస్తున్నారు. 2004 అసెంబ్లీ ఎన్నికల వరకూ పోడూరు మండలంలోని 16 గ్రామాలు ఆచంట నియోజకవర్గంలో ఉండేవి. 2004 ఎన్నికలు తర్వాత 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ నియోజకవర్గాలు పునర్విభజన జరిగింది. అప్పటి వరకూ ఆచంట నియోజకవర్గంలో ఉన్న పోడూరు మండ లంలోని 16 గ్రామాల్లో 8గ్రామాలు ఆచంట నియోజకవర్గంలోనికి మిగిలిన 8 గ్రామాలు పాలకొల్లు నియోజకవర్గంలోకి వెళ్లిపోయాయి. పోడూరు, జగన్నాధ పురం, తూర్పుపాలెం, మినిమించిలిపాడు, కవిటం, పి.పోలవరం, గుమ్మలూరు గ్రామాలు ఆచంట నియోజకవర్గంలోనూ, అప్పన్నచెర్వు, పెనుమదం, వద్దిపర్రు, రావిపాడు, మట్టపర్రు, జిన్నూరు, వేడంగి, కొమ్ముచిక్కాల గ్రామాలు పాలకొల్లు నియోజకవర్గంలో ఉన్నాయి. మండలంలో ఒకేసారి ఇద్దరు ఎమ్మెల్యేలు కార్య క్రమాలు పెట్టినప్పుడు మండలస్థాయి అధికారులు తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యుఎస్, వ్యవసాయ శాఖ, మండలశాఖ అధికారులు ఇబ్బంది పడు తున్నారు. ఒక్కోసారి పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే పెట్టిన కార్యక్రమానికి హాజరై ఆచంట ఎమ్మెల్యే కార్యక్రమాలకు హాజరు కాకపోతే ఇక్కడికి పలానా అధికారి ఎందుకు రాలేదంటూ అధికారులపై చిర్రుబుర్రులాడిన సంఘటలను కూడా ఉన్నాయి. ఒకే మండలంలో ఇద్దరు ఎమ్మెల్యేల పాలన ఉండటం అధికా రులకు పెద్ద తలనొప్పిగా మారింది.

అధికారి మాట

ఎన్నికలయ్యేంతవరకు ఇక్కడే ఉంటా

ఉల్లంఘనలపై 91546 90388 నంబర్‌కు ఫిర్యాదు చేయండి

ఎన్నికల సాధారణ పరిశీలకుడు కృష్ణకాంత్ పాఠక్



ఎన్నికల అబ్జర్వర్‌గా వచ్చిన రాజస్థాన్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్పీ ప్రశాంతి

ఏలూరుసిటీ, ఏప్రిల్ 23: ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై తనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చునని ఏలూరు జిల్లా ఎన్నికల సాధారణ పరి శీలకుడు కృష్ణకాంత్ పాఠక్ చెప్పారు. ఎన్నికల సాధారణ పరిశీకునిగా ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో తనను స్వయంగా కలిసి సమాచారాన్ని అందించవచ్చునన్నారు. ఉదయం 11 గంట ల్లోపు లేదా సాయంత్రం 5 గంటల దాటిన తర్వాత తనను కలిసి ఫిర్యాదులను వీలైతే సాక్ష్యాలతో సహా సమర్పించాలన్నారు. లేదా తన ఫోన్ నెంబర్ 91546 90388కు ఫోన్ చేసి వివరాలు తెలియ జేయవచ్చున్నారు. ఏలూరు పార్లమెంట్, ఏలూరు, ఉంగు టూరు, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల పరిశీల కునిగా బాధ్యతలు స్వీకరించానన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని రెవెన్యూ అతిథి గృహంలో బస చేశానన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఇక్కడే ఉంటానని, జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరిగి నట్లు ప్రజలు ఎక్కడైనా గుర్తిస్తే అందుకు సంబంధించిన సమాచారాన్ని నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఉద్యోగులంతా ఓటుహక్కు వినియోగించుకునేలా చేయండి

వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు



ఏలూరు రూరల్, ఏప్రిల్ 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో ఉద్యోగులందరూ ఓటుహక్కు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాలని రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాని కోరినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 15 వేల మంది గ్రామ రెవెన్యూ అధికారులకు, ఇతర ఉద్యో గులకు ఓటుహక్కు వినియోగించు కోవాలంటే ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతం నుంచి ఫారం- 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌తో ఓటుహక్కు వినియోగించుకోవాలని చెపుతున్నారని కాని చాలా జిల్లాల్లో ఈ రకమైన పరిస్థితి కనిపించడం లేద న్నారు. చాలామంది గ్రామ రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలుగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని దానివల్ల వారి సొంత గ్రామంలో ఓటుహక్కు విని యోగించుకోవడానికి చాలా జిల్లాల్లో పోస్టల్ బ్యాలెట్ తీసుకోవడానికి నిరాకరిస్తు న్నారన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులందరికి ఆ నియోజకవర్గంలో ఓటుహక్కు వినియోగానికి రిటర్నింగ్ అధికారి పరిధిలో చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వా లని కోరినట్లు తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న బీఎల్‌వోలకు గత రెండేళ్ల నుంచి గౌరవవేతనం ఇవ్వ లేదని ఆ నిధులు తక్షణం విడుదల చేయాలని, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా ప్రభుత్వ విధానాలు

పరకాల ప్రభాకర్



నరసాపురం, ఏప్రిల్ 23 : ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని దీనికోసం ప్రజల మధ్య కులాల చిచ్చు పెడు తున్నారని ప్రముఖ ఆర్థిక నిపుణుడు,రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ మండిపడ్డారు. ప్రజా స్వామ్యం అంటే మేము చెప్పింది వినడమే అన్న ధోరణ కొనసాగడం దారుణ మన్నారు. ఈ విధానాలను అడ్డుకోకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉంద న్నారు. మంగళవారం రాత్రి అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో లౌకిక, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసం గించారు. దేశంలో చదువుకున్న 62 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు లేక రైతులు రోడ్డెక్కి ఆందోళనలకు దిగుతున్నారన్నారు.దేశ ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో కూరుకుపోయిందని, తలసరి ఆదాయం 140వ స్థానానికి పడి పోయిందని వీటికి కారణం కేంద్రం తీసుకుంటున్న విధానాలేనన్నారు. ఈసారి ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే దిపాటి రాజగోపాల్, నెక్కంటి సుబ్బారావు, చల్లా దానయ్య నాయుడు, పురేళ్ల శ్రీనివాస్, పోలిశెట్టి సూరిబాబు, చెన్నా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ బ్యాక్



చింతలపూడి..జిల్లాలోనే ఇది అతిపెద్ద నియోజకవర్గం. ఎస్సీ రిజర్వుడు అయిన ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట . రాజకీయంగా చైతన్యం చెందిన ఓటర్లు. అభివృద్ధి పరంగా ఇంకా వెనుకబడే ఉంది. వరి, పామాయిల్, మొక్కజొన్న వంటి ఉద్యాన పంటలే జీవనాధారం. వర్షాధారమైన చెరువులు, గొట్టపు బావుల ద్వారా సేద్యం ఆధారపడి ఉంది. తెలంగాణ సరిహద్దులో ఈ నియోజకవర్గం ఉంది. బౌద్ధ చరిత్ర కలిగిన గుంటుపల్లి గుహలు, తమ్మిలేరు, వెంగళరాయసాగర్ రిజర్వాయర్లు ఉన్నాయి. 400 లకుపైగా అనుసంధానం కలిగిన చెరువులు ఉన్నాయి. చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు మెట్ట గ్రామాలకు, కృష్ణా జిల్లాకు మళ్ళించేలా కాల్వల నిర్మాణం చేపట్టారు.

- చింతలపూడి



చైతన్యపూడి

జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గం..

ఓటర్లలోనూ ప్రథమం

రిజర్వు నియోజకవర్గంలో రాజకీయ చైతన్యం



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెట్టప్రాంతమైన చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధిలేక ఇప్పటికి వెనుకబడే ఉన్నా రాజకీయాల్లో మాత్రం చైతన్యం కలిగిన ప్రాంతం. తెలుగుదేశం పార్టీ రాకముందు స్థానిక సంస్థల రాజకీయాల్లో పార్టీల ప్రభావం కన్నా వర్గరాజకీయం నడిచేది. రెండు సామాజికవర్గాలు పోటీపడేవి. మండలాలు ఏర్పడక ముందు పంచాయతీ సమితి, భూమి తనఖా బ్యాంకుల పాలకవర్గాల ఎన్నికల్లో వెలమవర్గం తరపున కోటగిరి విద్యాధర్‌రావు, కమ్మ సామాజికవర్గం తరపున మందలపు సత్యనారాయణ వర్గం పోటీపడేవి. ఇవి ఎంతలా అంటే సర్పంచ్‌లను దాచిపెట్టి క్యాంపులు కూడా నిర్వహించేవరకు పోటీగా ఉండేది.

నియోజకవర్గంలో అభివృద్ధి

దశాబ్దాల కాలంగా నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. గడిచిన ఐదేళ్లల్లో ఎంతో అభివృద్ధి సాధించింది. జంగారెడ్డిగూడెం పట్టణ ప్రజలకు శుద్ధిచేసిన తాగునీరును అందించేందుకు కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్ట్ వద్ద నీటి శుద్ధికేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన జరిగింది. జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ పరిధిలో 2107 మంది పేదలకు జీప్లస్-3 విధానంలో అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద ఇళ్ళు నిర్మాణం చేపట్టారు. ఈ ప్రభుత్వం వచ్చాక ముందుకు వెళ్లలేదు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలకు ఐదు ఎకరాలు, కోర్టు నిర్మాణానికి రెండు ఎకరాల భూమి కేటాయించారు.

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన చింతలపూడి వైశాల్యంలోనూ, ఓటర్లలోనూ పెద్దది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లు అధికమే. మొత్తం నాలుగు మండలాల్లో 2,71,502 మంది ఓటర్లు ఉండగా,పురుషులు 1,33,747, మహిళలు 1,37,714 మంది, ట్రాన్స్ జెండర్లు 41 మంది ఉన్నారు. ఇందులో 3,967 మంది పురుషుల కంటే మహిళలే అధికం.

ముఖ్యమైన ప్రాజెక్టులు

ఈ నియోజకవర్గంలో చింతలపూడి తమ్మిలేరు, జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం ఎర్రకాలువల ప్రాజెక్టులు ఉన్నాయి. తమ్మిలేరు ద్వారా తొమ్మిది వేల ఎకరాలకు, ఎర్రకాలువ ద్వారా 25 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎర్రకాలువపై వందలాది మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారు.

చారిత్రక, పర్యాటక ప్రదేశాలు

కామవరపుకోట మండలంలో గుంటుపల్లి బౌద్ధాలయ గుహలు. జంగారెడ్డిగూడెం మండలం కొంగు వారిగూడెం ఎర్రకాలువ జలాశయం, గుర్వాయిగూడెం ప్రముఖ పుణ్యక్షేత్రం మద్ది ఆంజనేయస్వామి ఆలయం ఉంది. చింతలపూడి ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు ఇమిడి ఉన్నాయని గతంలో అధికారులు గుర్తించారు. వాటిని వెలికి తీస్తే ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య పోతుంది. ఆదాయం పెరుగుతుంది.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	ముడపర్తి కూనేరావు	సీపీఐ	కెవీఎస్‌వీ రావు	కాంగ్రెసు	7,341
1962	రేవులగడ్డ ఏసుపాదం	కాంగ్రెసు	కె.సుబ్బారావు	స్వతంత్ర	2,965
1967	గద్దే విష్ణుమూర్తి	కాంగ్రెసు	ఐ.పాపారావు	స్వతంత్ర	10,825
1972	దన్నపనేని కూనేశ్వరరావు	స్వతంత్ర	ఐ.దానయ్య	కాంగ్రెసు	4,975
1978	గద్దే వెంకటేశ్వరరావు	కాంగ్రెసు(ఐ)	ఎం.సత్యనారాయణ	జనతా	5,250
1983	కోటగిరి విద్యాధరరావు	స్వంతంత్ర	కెఎల్‌ఎన్ రాజు	టీడీపీ	7,187
1985	కోటగిరి విద్యాధరరావు	తెలుగుదేశం	ఎం.సత్యనారాయణ	కాంగ్రెసు	11,075
1989	కోటగిరి విద్యాధరరావు	తెలుగుదేశం	ఎం.సత్యనారాయణ	కాంగ్రెసు	7,206
1994	కోటగిరి విద్యాధరరావు	తెలుగుదేశం	ఎం.సత్యనారాయణ	కాంగ్రెసు	13,783
1999	కోటగిరి విద్యాధరరావు	తెలుగుదేశం	ఎం.జమునారాణి	కాంగ్రెసు	31,890
2004	ఘంటా మురళీరామకృష్ణ	కాంగ్రెసు	కోటగిరి విద్యాధరరావు	టీడీపీ	1,506
2009	మద్దాల రాజేష్	కాంగ్రెసు	కర్రా రాజారావు	టీడీపీ	1,417
2014	పీతల సుజాత	తెలుగుదేశం	బూర్ల దేవీప్రియ	వైసీపీ	15,164
2019	ఉన్నమట్ల ఎలీజా	వైసీపీ	కర్రా రాజారావు	టీడీపీ	36,175



చింతలపూడి ఎత్తిపోతల పథకం

మూడు సార్లు మంత్రి పదవులు

1983లో ఎన్‌టీఆర్ తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలో ఈ నియోజక వర్గంలో త్రిముఖ పోటీ జరిగింది. కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి రాకపోవడంతో రెబల్‌గా, స్వతంత్ర అభ్యర్థిగా కోటగిరి విద్యాధరరావు పోటీచేసి 7,187 ఓట్ల మెజార్టీతో తెలుగుదేశం అభ్యర్థిపై గెలుపొందారు. రాష్ట్రంలో ఈ విధంగా ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు గెలవడంతో అందరితో పాటు కోటగిరి కూడా అధికారపార్టీ తెలుగుదేశంలో చేరారు. అప్పటి నుంచి 20 ఏళ్ల పాటు తెలుగు దేశానికి కంచుకోటగా నియోజకవర్గాన్ని నిలిపారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి ఘంటా మురళీరామకృష్ణపై 1606 ఓట్ల తేడాతో వరుసగా ఐదుసార్లు గెలిచిన కోటగిరి ఓటమి చవిచూశారు. ఈ ఓటమి వెనుక వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ప్రభావం ఉందని చెప్తుంటారు. విద్యాధరరావుని ఓడించాలనే 2003లో జిల్లాలో పాదయాత్ర ఏడురోజుల పాటు జరిపిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ నియోజక వర్గంలో మూడురోజులు ఉన్నారు.2009 నాటికి చింతలపూడి ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంగా మారింది. జంగారెడ్డిగూడెం మండలాన్ని ఇందులో కలిపారు. దీంతో ఈ నియోజకవర్గం జిల్లాలోనే పెద్ద నియోజకవర్గంగా అత్యధిక ఓట్లు ఉన్న నియోజకవర్గంగా మారింది. 2009 ఎన్నికల్లో కూడా త్రిముఖ పోటీ జరిగింది. ఈ త్రిముఖ పోటీలో కాంగ్రెస్ అభ్యర్థి మద్దాల రాజేష్‌కుమార్ కూడా 1417 ఓట్లతో తెలుగుదేశం అభ్యర్థి కర్రా రాజారావు పై పోటీచేసి విజయం సాధించారు.రాష్ట్రవిభజన తర్వాత 2014 ఎన్నికల్లో మహిళా అభ్యర్థులు పోటీపడ్డారు. టీడీపీ తరపున పీతల సుజాత పోటీచేయగా, వైసీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మద్దాల రాజేష్‌కుమార్ భార్య బూర్ల దేవిప్రియ మధ్య పోటీ జరిగింది. 15,164 ఓట్ల మెజార్టీతో పీతల సుజాత విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఉన్నమట్ల ఎలీజా, టీడీపీ అభ్యర్థి కర్రా రాజారావుపై 36,175 ఓట్ల మెజార్టీ సాధించారు. 1983 నుంచి 2019వరకు ఉమ్మడి రాష్ట్రం, విభజన తరువాత జరిగిన మొత్తం అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ఒకసారి, తెలుగుదేశం ఐదుసార్లు, కాంగ్రెస్ రెండుసార్లు, వైసీపీ ఒకసారి విజయం సాధించారు. ఇందులో కోటగిరి 20 ఏళ్ళపాటు ఎమ్మెల్యేగా వరుసగా విజయం సాధించగా, 20 ఏళ్ళలో ఆయన ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్‌గాను, ఎన్‌టీఆర్ హయాంలో వ్యవసాయశాఖా మంత్రిగాను, చంద్రబాబు హయాంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా కొద్దికాలం,తరువాత బారీ పరిశ్రమల శాఖామంత్రిగా పనిచేశారు. 2008లో ఆయన తెలుగుదేశం పార్టీని వీడి ప్రజారాజ్యంలో చేరారు. ఉంగుటూరులో పోటీచేసి ఓటమి చవిచూశారు. ఆ తరువాత ప్రజారాజ్యం కాంగ్రెస్‌లో విలీనం కావడంతో కాంగ్రెస్‌లో కొనసాగారు. 2014లో టీడీపీ తరపున గెలిచిన పీతల సుజాత, చంద్రబాబు ప్రభుత్వంలో గనులు,స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు.

టీడీపీ కంచుకోట

టీడీపీ పార్టీ తరపున కోటగిరి విద్యాధరరావు 1985, 1989, 1994, 1999వ సంవత్సరంలో వరుసగా విజయం సాధించారు. దీంతో 1994, 1999వ సంవత్సరాల్లో విద్యాధరరావు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే పీతల సుజాత 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా మూడు సంవత్సరాలు పనిచేశారు.

నామినేషన్ల కోలాహలం

అభ్యర్థులు భారీ ర్యాలీలతో , ప్రదర్శనలతో నామినేషన్లు వేసేందుకు తరలి వెళ్లారు. మంగళవారం ఏలూరులో ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి, ఉంగుటూరులో జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, కైకలూరులో బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.



పత్సమట్ల ధర్మరాజు నామినేషన్ సందర్భంగా ఉంగుటూరులో భారీ ర్యాలీగా కార్యకర్తలు,అభిమానులు







ఏలూరులో బడేటి చంటి నామినేషన్ సందర్భంగా బుట్టబొమ్మల సందడి.. డప్పు కళాకారుల విన్యాసాలు.. మంగళ వాయిద్యాలు





బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, ఎన్టీఆర్ వేషధారణలు



కైకలూరులో కామినేని శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ

అభ్యర్థుల ఆస్తులు- అప్పులు

ఏలూరు (ఎంపీ అభ్యర్థి) : పుట్టా మహేష్ కుమార్ యాదవ్ (టీడీపీ)



విద్యార్హతలు : బీటెక్
కేసులు : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెండింగ్
స్థిరాస్తులు రూ.16.70 కోట్లు,
భార్యపేరున రూ.6.76 కోట్లు...
చరాస్తులు.. రూ.42.22 కోట్లు,
భార్య పేరున రూ.1.25 కోట్లు,
అప్పులు : రూ.19.67 కోట్లు,
భార్య పేరున : రూ.47 లక్షలు.

ఏలూరు : బడేటి రాధాకృష్ణయ్య (టీడీపీ)



విద్యా అర్హతలు : బీకాం.
స్థిరాస్తులు : 1,39,87,570
భార్య పేరున : కోటి 41 లక్షల 44 వేల 938
చరాస్తులు - లక్షా 58 వేల 122
భార్య పేరున - 22 లక్షలు
అప్పులు : 54 లక్షల 49 వేల 421
భార్య పేరున 31 లక్షల 84 వేల 758

కైకలూరు : డాక్టర్ కామినేని శ్రీనివాస్ (బీజేపీ)



చరాస్తులు : రూ.55 లక్షలు
భార్య పేరున రూ.1.04 కోట్లు
స్థిరాస్తులు : 6.55 కోట్లు
భార్య పేరున రూ. 2.39 కోట్లు
బంగారం : 1460 గ్రాములు
వ్యవసాయ భూమి : 11.75 ఎకరాలు
భార్య పేరున 4.24 ఎకరాలు
వాహనాలు : 24 లక్షలు విలువైన ఇన్నోవా కారు
భార్య పేరున 14.5 లక్షలు విలువ గల హోండా సిటీ
కేసులు : 2021లో కొవిడ్ సమయంలో మహా పాద యాత్రలో పాల్గొన్నందుకు కావలి పోలీసుస్టేషన్లో ఒక కేసు పెండింగ్‌లో ఉంది.

1.09 లక్షలు స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా రూ.1920 విలువైన ఏడు లీటర్ల మద్యం సీజ్ చేశామని, లక్షా 9 వేల 800 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.


నామినేషన్‌కు తరలివెళుతున్న కూటమి అభ్యర్థి ధర్మరాజు, చిత్రంలో గన్ని

అట్టహాసంగా పత్సమట్ల ధర్మరాజు నామినేషన్

▸ మోటారు సైకిళ్ళ ర్యాలీతో హైవే పసుపుమయం

ఉంగుటూరు, ఏప్రిల్ 23 : ఉంగుటూరు నియోజవకర్గ కూటమి జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు నామినేషన్ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా సాగింది. జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణుల మోటారు సైకిళ్ళ ర్యాలీ, ఆటోలు, కార్ల ర్యాలీతో జాతీయరహదారి పసుపుమయం అయింది. భీమడోలు నిడమర్రు, ఉంగుటూరు, గణపవరం మండలాల నుంచి కూటమి పార్టీల కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉంగుటూరు తరలి రావడంతో పండుగ వాతావరణం వచ్చింది. కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు స్వగ్రామమైన నిడమర్రు మండలం ఫత్తేపురం గ్రామదేవత చిట్టాలమ్మ అమ్మవారిని దర్శించుకుని అక్కడి నుంచి ఉంగుటూరు మండలం నారాయణపురం మురుక్కోడు వంతెన వద్ద నుంచి నిడమర్రు, గణపవరం మండలాల కార్యకర్తలతో కలసి ర్యాలీగా బయలు దేరి ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ జడ్పీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, నియోజకవర్గ జనసేన నిర్వహణ సమన్వయకర్త వట్టి పవన్ కుమార్‌ల ఆధ్వర్యంలో కార్యకర్తలు అభిమానులు తరలివచ్చారు.

జాతీయ బాలికల చెస్ జట్టుకి ప్రేమిరక్షిత

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 :విజయవాడలో ఈనెల 20,21 తేదీల్లో నిర్వహించిన ఏపీ ఓపెన్ చెస్ బాలికల చాంపియన్‌షిప్-2024 అండర్-17 విభాగం పోటీలో వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ స్కూలు ఆరో తరగతి విద్యార్థిని వై.ప్రేమిరక్షిత రెండోర్యాంక్ సాధించిందని స్కూలు డైరెక్టర్ కోనేరు సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విజయంతో జూలైలో చండీఘడ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అండర్-17 చెస్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొనే రాష్ట్రజట్టుకి ప్రేమిరక్షిత ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. బాల్యంనుంచే చెస్‌లో అసాధారణ నైపుణ్యాలతో అద్భుత విజయాలను నమోదుచేసుకుంటోందన్నారు. విజేతను, కోచ్ యడ్ల మహేష్‌ను అభినందించారు.


బాలికను అభినందిస్తున్న స్కూలు డైరెక్టర్ సురేష్‌బాబు

బాస్కెట్‌బాల్ పోటీల్లో 'పశ్చిమ' జట్టు ఫస్ట్

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 23: నూజివీడులో ఈనెల 19 నుంచి 22వరకు నూజివీడు బెతస్థ సీబీఎస్ఈ స్కూల్లో ఆంధ్రప్రదేశ్ తొమ్మిదో అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ చాంపియన్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టు మంచి ప్రతిభ కనబరిచింది. లీగ్ పోటీల్లో చిత్తూరు జట్టుపై 37-04, విశాఖపట్నం జట్టుమీద 40-23, కృష్ణాజట్టుపై 35-22, సెమీఫైనల్లో తూర్పుగోదావరి జట్టుపై 40-29 స్కోరుతో గెలిచి ఫైనల్స్‌లో కృష్ణా జట్టుపై 49-48 స్కోరుతో ప్రథమ స్థానం సాధించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జట్టును అభినందించారు.


గెలుపొందిన బాలికల జట్టు

టీసీసీ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షకు జిల్లాలో 33మంది విద్యార్థులకు 15మంది, హయ్యర్‌గ్రేడ్ పరీక్షకు 11 మందికి 8 మంది, టైలరింగ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షకు 25మందికి 18మంది హాజరయ్యారన్నారు.

డీఎల్ఎడ్ పరీక్షలు : డీఎల్ఎడ్ మూడో సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షకు జిల్లాలో 63 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా 60మంది, మొదటి సెమిస్టర్ పరీక్షకు 51మందికి 49మంది హాజరయ్యారని డీఈవో తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదన్నారు.

26న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

చింతలపూడి, ఏప్రిల్ 23: చింతలపూడి సబ్‌డివిజన్‌లో ఈనెల 26న విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారం కోసం పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీఈఈ రాధాకృష్ణ తెలిపారు. ఈ సమవేశంలో వినియోగదారులు తమ సమస్యలు నివృత్తి చేసుకోవాలని సూచించారు.

క్రైం వార్తలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 : సెప్టిక్ ట్యాంక్ వాహనాన్ని నడుపుతూ ప్రమాదవశాత్తు అదుపుతప్పి పడిపోయిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన ఒక వ్యక్తి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన సిద్దునూరి థామస్(47) ఈనెల 8వ తేదీన దెందులూరు మండలం కొవ్వలిలో సెప్టిక్ ట్యాంక్‌ను తోడడానికి వాహనాన్ని వేసుకుని వెళ్లాడు. అక్కడ నుంచి వ్యర్థాలను తీసుకుని ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి వద్ద సర్వీసు రోడ్డులో వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్ర గాయాలవ్వడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



దెందులూరు,ఏప్రిల్ 23 : 16వ నంబరు జాతీయ రహదారిపై వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాలివి.. మండల పరిధిలోని ఉండ్రాజవరం అడ్డరోడ్డు బ్రిడ్జి కింద మంగళవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు సుమారు 50 ఏళ్ల వయస్సుతో ఎరుపు రంగుతో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలకు దెందులూరు ఎస్ఐ స్వామి 94407 96654 నంబరుకు తెలియజేయాలన్నారు.

విద్యుత్ ఉపకరణాల చోరీ

టి.నరసాపురం, ఏప్రిల్ 23 : విద్యుత్ ఉపకరణాలు చోరీకి గురైన సంఘటన మండలంలోని తిరుమలదేవిపేటలో జరిగింది. రైతులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన దాకారపు సూరిబాబు, తోట వీరాస్వామి నాయుడుకు చెందిన వ్యవసాయ భూమిలో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి రాగి తీగెలు అపహరించుకుపోయినట్లు బాధిత రైతులు తెలిపారు. ఈ ఘటనపై తగు చర్య నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి లారీ దగ్ధం



టి.నరసాపురం, ఏప్రిల్ 23 : విద్యుత్ షాక్‌తో లారీ దగ్ధమైన సంఘటన మంగళవారం టి.నరసాపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలివి ఏపిగుంట శివారు నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు మట్టి తరలిస్తున్న లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో విద్యుత్తు తీగెలకు తాకి మంటలు చెలరేగాయి. డ్రైవర్ లారీ నుంచి కిందకు దూకడంతో ప్రాణహాని తప్పింది. మంటల్లో లారీ పూర్తిగా దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు.

రాక్షస పాలన నుంచి విముక్తే లక్ష్యం

▸ దెందులూరు కూటమి అభ్యర్థి చింతమనేని

పెదవేగి/దెందులూరు, ఏప్రిల్ 23 : ఐదేళ్ల రాక్షస పాలనలో నలిగిపోతున్న రాష్ట్రానికి విముక్తి కల్పించడమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని దెందులూరు కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ పిలుపునిచ్చారు. పెదవేగి మండలం చక్రాయగూడెం, సీతారామపురం, కొప్పులవారిగూడెం గ్రామాల్లో, దెందులూరు మండలం ముప్పవరం, పెరుగుగూడెం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో మూడోసారి గెలిపించాలని కోరారు. పెరుగుగూడెంలో మాజీ సర్పంచ్ యలమర్తి హేమశ్రీనివాస్, పార్టీ గ్రామ అధ్యక్షుడు పావులూరి ఠశరధరామయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. జనసేన పార్టీ నాయకురాలు ఘంటశాల వెంకట లక్ష్మి, కొఠారు ఆదిశేషు, టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, నాగనబోయిన సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి పరసా వెంకట్రావు, కార్యకర్తలు పాల్గొన్నారు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్యశ్రీ ప్రచారం నిర్వహించారు.

● చింతలపూడి : ప్రగడవరంలో మంగళవారం టీడీపీ నాయకులు కనమతరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం సూపర్‌సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. తొమ్మండ్రు వెంకట్రావు, చిలుకూరి శ్రీనివాసరెడ్డి, బాబు యాదవ్, రాము తదితరులు పాల్గొన్నారు.


చక్రాయగూడెం ప్రచారంలో చింతమనేని


కుక్కునూరులో చిర్రి బాలరాజు ప్రచారం

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి : చిర్రి బాలరాజు

కుక్కునూరు/కొయ్యలగూడెం, ఏప్రిల్ 23 పోలవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు మంగళవారం కుక్కునూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. అరవాయిపల్లి, నెమలిపేట, దాచారం, బెస్తగూడెం, కివ్వాక గ్రామాల్లో టీడీపీ ముఖ్యనాయకులను కలసి మద్దతు కోరారు. పోలవరం నిర్వాసితులం దరికీ తన వంతుగా వారి సమస్యలను పరిష్కరిం చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనా రాయణ, పిచుక రాజు, బొల్లి కృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు ఎం.యుగంధర్, ఎం.వెంకన్నబాబు, మంత్రి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కొయ్యలగూడెం పట్టణంలో ఇంటింటా ప్రచారంలో పోలవరం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు. నియోజకవర్గంలో అన్ని సమస్యలు పరిష్కరించగమే లక్ష్యమని తెలిపారు. మొట్టమొదటి సారిగా ప్రచారంలో బొరగం శ్రీను పాల్గొనడంతో పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.


దివ్యాంగుడితో మాట్లాడుతున్న ధర్మరాజు

పూళ్లలో 'జనంలోకి ధర్మరాజు'

భీమడోలు/నిడమర్రు/గణపవరం : ఐదేళ్ల క్రితం వైసీపీకి ఓటు వేసిన తప్పుకు ఫలితంగా రాష్ట్ర ప్రజలంతా శిక్షను అనుభవించారని ఉంగుటూరు ఉమ్మడి జనసేన అసెంబ్లీ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పూళ్ళ గ్రామంలో జనంలోకి ధర్మరాజు కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉంగుటూరు నియోజకవర్గ సమన్వయకర్త వట్టి పవన్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రచారం చేశారు. పత్సమట్ల ధర్మరాజు, వట్టి పవన్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రతి మదన్, పుప్పాల శ్రీనివాసరావు, మోచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ కార్యక్రమానికి వెళ్లే ముందు పత్సమట్ల ధర్మరాజు తన స్వగ్రామమైన నిడమర్రు మండలం ఫత్తేపురంలో తన తల్లిదండ్రులైన పత్సమట్ల లక్ష్మీనారాయణరాజు-జయలక్ష్మి ఆశీస్సులు తీసుకుని వెళ్లారు. గణపవరం మండల గ్రామాల నుంచి అభిమానులు నాయకులు మోటారు సైకిళ్ల, కార్లు, ఆటోలపై ఉంగుటూరు తరలి వెళ్లారు. తొలుత గణపవరం చేరుకుని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న, యాళ్ళ సుబ్బారావు,భీమవరపు ఏసురాజు, తోట శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలతో వైసీపీ పతనం ఖాయం

▸ సీతంపేటలో కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా, ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ఇంటింటి ప్రచారం



సీతంపేటలో ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి మహేష్‌యాదవ్, దెందులూరు కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్

దెందులూరు, ఏప్రిల్ 23 : వైసీపీ పతనం ప్రారంభమైందని, మరోసారి జగన్‌ను నమ్మి ఓటు వేస్తే మన భూములు మనకు ఉండవని, విభజన ఆంధ్రప్రదేశ్‌ను గాడిలో పెట్టి అభివృద్ధి చేస్తూ సంపదన సృష్టించి సంక్షేమ పథకాలు అందించగలిగే నాయకుడు చంద్రబాబు నాయుడు మాత్రమేనని, ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలందరూ మద్దతు పలకాలని ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ కోరారు. మండలంలోని సీతంపేటలో మంగళవారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. సీతంపేట నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్, చింతమనేని మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామన్నారు. రైతుల, మహిళల, అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం చేసి అభివృద్ధి చేయడంతో పాటుగా రాజధాని అమరావతి, పోలవరం పూర్తి చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వైసీపీకి అవకాశం ఇవ్వకుండా కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకురాలు ఘంటశాల వెంకటలక్ష్మీ, కొఠారు ఆదిశేషులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కర పత్రాలను పంపిణీ చేసి ఓటర్ల మద్దతు కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, మండల పార్టీ కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి పరసా వెంకట్రావు, పర్వతనేని రామకృష్ణ, జనసేన, టీడీపీ, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

టీడీపీ ప్రొఫెషనల్ విభాగం రాష్ట్ర ఆర్గనైజర్‌గా తాళ్లూరి రమేష్

దెందులూరు, ఏప్రిల్ 23 : టీడీపీ మరింత బలోపేతానికి విశేష కృషి చేస్తున్న పార్టీ నేత తాళ్లూరి రమేష్‌ను పార్టీ ప్రొఫెషనల్ విభాగం రాష్ట్ర ఆర్గనైజర్‌గా పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నియమించారు. ఆర్టీ అభివృద్ధి, సంక్షేమానికి విశేష సేవలందిస్తూనే చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో మద్దతుగా అనేక కార్యక్రమాలు చేసి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన హైదరబాద్‌లో ఉన్న ఆంధ్రపదేశ్‌కు చెందిన ఓటర్లను గుర్తించి, వారిని ఆంధ్రాలో ప్రత్యేక డ్రైవ్ పెట్టించి వెయ్యి మంది పార్టీ సభ్యత్వం తీసుకునే విధంగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు.

మహిళలకు జూట్‌బ్యాగ్స్ తయారీపై శిక్షణ

పెదపాడు, ఏప్రిల్ 23 :నిరుద్యోగ మహిళల ఉజ్వల భవిష్యత్తుకై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉచితంగా జూట్ బ్యాగ్స్ తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల 29వ తేదీ నుంచి 18 రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఐదో తరగతి ఆపైన విద్యార్హత గల 18-35 ఏళ్ల లోపు మహిళలు ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా శిక్షణతో పాటుగా భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 99485 65256, 95330 79471, 90140 40780 నంబర్లలో సత్రంపాడులోని సంస్థ కార్యాలయం వద్ద సంప్రదించాలన్నారు.

నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలి

పెదపాడు, ఏప్రిల్ 23 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన నాడు-నేడు పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ఈఈ పి.రమణకుమారి తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు, పెదపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను మంగళవారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా మండల విద్యాశాఖాధికారులకు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలకు ప్రాధాన్యం లేకే రాజీనామా చేశా

బుట్టాయగూడెం, ఏప్రిల్ 23 : రాష్ట్ర పార్టీలో ఆదివాసీలకు ప్రాధాన్యం లేకపోవడంతో రాజీనామా చేశానని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొడియం శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తన రాజీనామా పత్రాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు ఈ-మెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు. ఆదివాసీలంటే చులకన భావం ఉందని, నైతిక విలువలకు తావులేదని, భావ ప్రకటన స్వాతంత్ర్యం లేదని వాపోయారు. ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలతోపాటు జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న గారపాటి సీతారామాంజనేయ చౌదరికి ఏలూరు ఎంపీ టికెట్‌ను ఇవ్వకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ ఎస్టీలపై, అవినీతిపై పోరాటాలు కొనసాగిస్తానని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

లింగపాలెం, ఏప్రిల్ 23: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని సీఐ ఎం.సుధాకర్ తెలిపారు. మంగళవారం లింగపాలెం మండలం ఆసన్నగూడెం, వేములపల్లి, ముడిచర్ల గ్రామాల్లో సాయుధ దళాలతో కవాతు నిర్వహించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నామని, ఎన్నికలకు ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరిగేలా చూస్తామన్నారు. ఎటువంటి హింసాత్మక ఘటనలకు పాల్పడకూడదని, అలా పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కవాతులో ఎస్ఐ పి.చెన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా రాట్నాలమ్మ తిరునాళ్లు ప్రారంభం

పెదవేగి, ఏప్రిల్ 23 :రాట్నాలకుంట రాట్నాలమ్మవారి తిరునాళ్ళ మంగళవారం ఉదయం 4.03 గంటలకు ఆలయ ఉత్సవకమిటీ ఛైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు దంపతుల తొలిపూజతో ప్రారంభమయ్యాయి. అర్చకులు ఉదయం విఘ్నేశ్వరపూజ, నవగ్రహ మండపారాధనతో ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు మంగళవారం రాట్నాలమ్మవారు బాలా త్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా నగరేశ్వరస్వామి ఊరేగింపు

ఏలూరు కార్పోరేషన్, ఏప్రిల్ 23 : అగ్రహారంలోని గంగా వింధ్య వాసిని సమేత నగరేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామికి అమ్మవార్లను రథంపై ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చి మొక్కుబడులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈవో గుబ్బల రామపెద్దింట్లరావు, సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్థానిక గొల్లాయిగూడెంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం రాత్రి సీతారాముల ఉత్సవమూర్తులను ఆటోపై అలంకరించి ఊరేగింపు జరిపారు. ఉత్సవ కమిటీ నాయకులు కణితి రాంబాబు మిత్రబృందం భక్తులకు ఏర్పాట్లు చేశారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

పెదపాడు, ఏప్రిల్ 23 :పెదపాడు మండలం అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. దాత కర్రి భద్రాచలం, అంజని దంపతుల ఆర్థిక సహకారంతో 200 మంది భక్తులకు అన్నప్రసాదాలు అందజేశామన్నారు. మంగళవారం కావడంతో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

కైకరం శివాలయంలో ప్రత్యేక పూజలు

ఉంగుటూరు, ఏప్రిల్ 23 :కైకరం పార్వతీ సమేత రామలింగేశ్వరాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండి సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో వారం రోజులుగా పూజలు నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాలలో శానం పెదబాబు, మొదలవలస భాస్కరరావు, కొచ్చర్లకోట శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం పార్వతీ రామలింగేశ్వర స్వామి, ద్వారపాలక కాలభైరవ తదితరాల ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.


జ్ఞానదీపికను అభినందిస్తున్న కరస్పాండెంట్ అవినాష్‌రాజు


స్కూల్ టాపర్‌లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

టెన్త్ మండల టాపర్ జ్ఞానదీపికకు అభినందన

పెదవేగి/ఏలూరు రూరల్, ఏప్రిల్ 23 :పదో తరగతి ఫలితాల్లో పెదవేగి మండలం టాపర్‌గా నిలిచిన పెద్దిశెట్టి జ్ఞానదీపికను పాఠశాల యాజమాన్యం అభినందించింది. పెదవేగిలోని ఎస్ఎంసీ హైస్కూల్ విద్యార్థిని జ్ఞానదీపిక 584 మా ర్కులతో మండలం టాపర్‌గా నిలిచింది. పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్. అవినాష్‌రాజు, హెచ్ఎం ఉష, పావని, గోపాలకృష్ణ, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా అవినాష్‌రాజు మాట్లాడుతూ ఇష్టంతోకూడిన విద్య విద్యార్థి భవిష్యత్‌ను ఉన్నతంగా మార్చుతుందన్నారు.

స్కూల్ టాపర్స్‌కు సత్కారం

ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి జడ్పీ హైస్కూల్లో టెన్త్ ఫలితాల్లో జి.ఎల్.ఎస్‌కృష్ణ 573, వై.నేహ 570, బి.అభిలాష్ 540మార్కులు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం వారిని పాఠశాలలో ఘనంగా సత్కరించి అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 23 : ఏలూరు జిల్లా కేఆర్‌పురం ఐటీడీఏలో పరిధిలోని కోటరామచంద్రపురం, బూసరాజుపల్లి, బర్రింకలపాడు ప్రాంతాల్లో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం ఇంటర్‌లో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పీవో ఎం.సూర్యతేజ మంగళవారం ప్రకటనలో తెలిపారు. బూసరాజుపల్లి బాలికల గురుకులంలో ఎంపీసీ 45, బైపీసీ 45, హెచ్ఈసీ 45, ఎఅండ్‌టీ 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కేఆర్‌పురం బాలుర గురుకులంలో ఎంపీసీ 40, బైపీసీ 40, సీఈసీ 40, హెచ్ఈసీ 40, ఏఅండ్‌టీ 20, జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గురుకుల కళాశాలలో ఎంపీసీ 45, బైపీసీ 45, సీఈసీ 45, హెచ్ఈసీ 45 సీట్లు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. ఈనెల 24 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. తల్లిదండ్రులు దగ్గరలో ఉన్న గురుకులంకు వెళ్లి ఉచితంగా పేర్లను ఆన్‌లైన్ చేసుకోవచ్చని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటు విలువపై ర్యాలీ, కళాజాత

ఏలూరు రూరల్, ఏప్రిల్ 23: ఎన్నికలను పురస్కరించుకుని ఏలూరు రూరల్ మండలం మల్కాపురం, చాటపర్రు గ్రామాల్లో మంగళవారం ఓటు విలువను తెలిపే నినాదాలు చేస్తూ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ సరళకుమారి మాట్లాడుతూ ఓటర్లందరూ పోలింగ్ రోజున తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వికలాంగులు, వృద్ధులుకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారని, వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు హోమ్ ఓటు సౌకర్యం కల్పించారన్నారు.

ఉపాధ్యాయుడు సత్యనారాయణకు సత్కారం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 23: నలభై ఒక్క ఏళ్ల పాటు ఉపాధ్యాయవృత్తిలో పనిచేస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు సహాయం చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు ఎస్.సత్యనారాయణ జాలిపూడి యూపీ పాఠశాలలో హెచ్ఎమ్‌గా పనిచేస్తూ ఈనెల 30న పదవీవిరమణ చేస్తున్న సందర్భంగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో రంగయ్య, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, కాంప్లెక్స్ ఛైర్మన్ ఎస్.వెంకటలక్ష్మి, ఎన్.సునంద తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణ దంపతులను సత్కారం

పోలసానిపల్లిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం

భీమడోలు, ఏప్రిల్ 23 :గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని పోలసానపల్లిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి శర్మిష్ట విచ్చేసి వైద్య సేవలు తనిఖీలు చేశారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై వివరించారు. వైద్యులు శ్రీలక్ష్మి, జాహ్నవి, ఆర్తి శ్రీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి

చింతలపూడి, ఏప్రిల్ 23: నాటుసారా, మద్యం అక్రమరవాణా జరగకుండా మద్యం నిల్వలపై నిఘాపెట్టి కేసులు నమోదు చేయాలని, అక్రమ మద్యం రవాణాను అరికట్టాలని ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ ఎం.శంకరయ్య సూచించారు. మంగళవారం చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. చింతలపూడి స్టేషన్‌పరిధిలో సరిహద్దు చెకపోస్టులు, సరిహద్దు ప్రాంతం ఉన్నందున గస్తీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎస్ఈబీ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గణపతిబాబు, చింతలపూడి ఇన్‌స్పెక్టర్ బి.ఎస్.ఎస్.వి ప్రసాద్, ఎస్ఐలు పాల్గొన్నారు.

శ్రీవారి ట్రస్టుకు రూ.9 లక్షల విరాళం


ట్రస్టుకు విరాళం అందిస్తున్న కంపెనీ ఎండీ, ప్రతినిధులు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 23: చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ కంపెనీ తరఫున రూ.9 లక్షలు విరాళంగా అందింది. బొమ్ములూరులోని దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం ఈ విరాళాన్ని చెక్ రూపంలో ఈవో త్రినాథరావుకు అందించారు. ఈ సంస్థ ఇప్పటివరకు రూ.1.11 కోట్లు స్వామివారి ట్రస్టులకు చెల్లించినట్టు ఈవో వివరించారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23:స్థానిక పడమరవీధిలోని ప్రభుత్వ బాలభవన్‌లో ఈనెల 24నుంచి వేసవి శిక్షణతరగతులు ప్రారంభిస్తున్నట్టు బాలభవన్ సూపరింటెండెంట్ జి.రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల నుంచి పదహారేళ్ల లోపు బాలబాలికలకు శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, టైలరింగ్ విభాగాల్లో శిక్షణ ఉంటుందన్నారు. ప్రతీరోజు ఉదయం 7.30 నుంచి 10.30 వరకు, సాయంత్రం 4.30-7.30 గంటల వరకు తరగతులు. ప్రతీ శుక్రవారం సెలవు. పూర్తి వివరాలకు బాలభవన్ కార్యాలయం 99892 07515లో సంప్రదించాలని కోరారు.

ఆర్‌బీకేల్లో ధాన్యం అమ్మకాలు చేసుకోవాలి

పోలవరం, ఏప్రిల్ 23 :ఆర్‌బీకేల్లో రైతులు ధాన్యం అమ్మకాలు చేసుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో ఏవో కె.రాంబాబు పేర్కొన్నారు. పోలవరం మండలంలో 2024-25 సీజన్లకు సంబంధించి నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని పోలవరం, పాత పట్టిసీమ, గూటాల, కొత్తపట్టిసీమ రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రేడ్-ఎ రకం క్వింటాకు రూ.2,203, సాధారణ రకం రూ.2,183 ధరగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని వరికోతల అనంతరం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విధిగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. కొత్తపట్టిసీమ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యదర్శి రవి కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

దెందులూరులో చలివేంద్రం ఏర్పాటు

దెందులూరు, ఏప్రిల్ 23 :దెందులూరుకు చెందిన రైతు విభాగం, టీడీపీ నేత, దాత వీరమాచినేని శివాజీ ఆధ్వర్యంలో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. పలు పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారికి తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఏడాది మాదిరిగానే చలివేంద్రం ఏర్పాటు చేశారు.

నేడు పార్థసారథి నామినేషన్‌కు భారీగా తరలిరండి

చాట్రాయి, ఏప్రిల్ 23: నూజివీడులో బుధవారం కూటమి అసెంబ్లీ అభ్యర్థి కొలుసు పార్థసారథి నామినేషన్ కార్యక్రమానికి చాట్రాయి మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీగా తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి విజ్ఞప్తి చేశారు. మండలంలో 18 పంచాయతీల నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రజలను తరలించటానికి ఆయా గ్రామాల నాయకులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముసునూరు: నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి బుధవారం నామినేషన్ వేస్తున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని ఢలరాం పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు జరిగే నామినేషన్‌కు ముసునూరు మండలం నుంచి భారీగా జనసమీకరణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవినేని తెలిపారు.

బాస్కెట్‌బాల్ విజేతలు 'పశ్చిమ', అనంతపురం జట్లు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 23: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ ఛాంపి యన్ షిప్ పోటీల్లో విజేతలుగా పశ్చిమగోదావరి, అనంతపురం జట్లు నిలిచాయి. బాలికల ఫైనల్స్‌లో పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లా జట్లు తలపడగా పశ్చిమ జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో అనంతపురం, తూర్పుగోదావరి జట్లు తలపడగా అనంతపురం జట్టు తూర్పుగోదావరిపై విజయం సాధించింది.


ఆర్వోకు నామినేషన్ అందజేస్తున్న కామినేని. చిత్రంలో కేంద్ర మంత్రి మురుగన్ తదితరులు

కూటమి గెలుపుతోనే రాష్ట్ర, దేశాభివృద్ధి

కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి మురుగన్

కైకలూరు, ఏప్రిల్ 23: కూటమితోనే రాష్ట్ర, దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ప్రజలంతా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ అన్నారు. మంగళవారం కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ నామినేషన్ ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే కొల్లేరు సమస్యల పరిష్కారం, అలాగే ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశముంటుందన్నారు. ఇప్పటికే కామినేని ఇక్కడ ఆక్వా పరిస్థితులను, కొల్లేరు సమస్యలను తనకు వివరించారని వీటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాగా కామినేని శ్రీనివాస్ నామినేషన్ పర్వం కోలాహలంగా జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా 25 వేల మంది ప్రజలు వాహనాల్లో పెద్దఎత్తున తరలిరావడంతో గ్రామీణ ప్రాంతాలతో పాటు కైకలూరు పట్టణంలో ఎన్డీయే కూటమి జెండాలు రెపరెపలాడాయి. కైకలూరు మండలం వరహాపట్నం నుంచి వేలాది మంది అభిమానులు, కార్యకర్తల నడుమ ప్రచార రథంపై ఊరేగుతూ మంత్రి ఎల్. మురుగన్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావుతో కలసి కైకలూరు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న కామినేని కైకలూరు రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఎంచుకున్న ముహూర్తం ప్రకారం 10.48లకు ఆర్వో సమక్షంలో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి 11.15లకు అందజేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకర్‌రావు

కూటమికే బీసీల మద్దతు

నూజివీడు, ఏప్రిల్ 23: రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం మద్దతు కూటమికేనని, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు అన్నారు. నూజివీడు టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ బీసీల సంక్షేమ పథకాలను పూర్తిగా ఎత్తివేసిందని, ఈ నేపథ్యంలో కొలుసు పార్థసారథి బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి అధికార పార్టీ నుంచి టీడీపీలో చేరారని, బీసీలకు న్యాయం చేసే పార్టీ ఒక్క టీడీపీ మాత్రమేనని, నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ వైసీపీ బీసీలకు వ్యవసాయ ప్రోత్సాహకాలు అందించలేదన్నారు. పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను పక్కన పెట్టిందన్నారు. టీడీపీ వస్తే నీటి పారుదల పథకాలు శరవేగంగా పూర్తవుతాయన్నారు. నూజివీడు కౌన్సిలర్ దాసరి స్వామి యాదవ్, నూజివీడు పట్టణ టీడీపీ కార్యదర్శి పల్లినాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లతో ఆత్మీయ సమావేశం

నూజివీడులో కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి పాస్టర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించి వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. అండగా నిలబడతానని హామీ ఇచ్చారు.

టీడీపీలో భారీ చేరికలు

నూజివీడు టౌన్: నూజివీడు నియోజకవర్గంలో టీడీపీలో భారీగా చేరుతున్నారు. నూజివీడు మండలం తుక్కులూరు గ్రామం నుంచి కల్లేపల్లి రవికుమార్, కొడాలి కృష్ణమోహన్ తదితర 30 కుటుంబాలు కొలుసు పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరాయి. అలాగే సిద్ధార్థ నగర్, హరియా తండాకు చెందిన పలువురు మాజీ సర్పంచ్ బాణావతు గోపయ్య, వార్డుమెంబర్ బాణావతు కృష్ణ నాయకత్వంలో సుమారు 50 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకోగా నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.